# "మరో ప్రేమ కథ"

ఆ అమ్మాయి పేరు పూనమ్. ఆ అబ్బాయి పేరు అల్లాఉద్దీన్. అమ్మాయి వయసు పదహారు. అబ్బాయి వయసు ఇరవై రెండేళ్ళు.

అతను పట్నం వెళ్ళి "నూరి'' అనే సినిమా చూసి వచ్చాడు. వస్తూనే పూనమ్‌ను ''నూరీ'' అంటూ పిల్చాడు. ఆ అమ్మాయికి అర్థం కాలేదు. ''నూరీ సినిమా చాలా బాగుంది. "నూరీ'' హీరోయిన్ పేరు. ఆ వేషం వేసిన స్టార్ అసలు పేరు కూడా ''పూనమ్''. నూరీ ఒక ముస్లిం అబ్బాయిని ప్రేమించింది. అవకాశం దొరికినప్పుడు ఆ సినిమా నీకూ చూపిస్తాను. ఇకనుంచి నిన్ను నూరీ అనే పిలుస్తాను'' అన్నాడు అల్లాఉద్దీన్ ఉద్వేగంతో.

పూనమ్ కళ్ళు పెద్దవిచేసి రెప్పలు టప టప లాడించింది. తను ఒక హీరోయిన్, అతను హీరో అయిపోయినట్టే ఊహించుకోసాగింది.

"కాని హిందువు ముస్లింను ప్రేమించడం ఎలా?" అమాయకంగా అడిగింది.

''ప్రేమకు మత బేధాలు వుండవు. ప్రేమ చాలా గొప్పది" అంటూ 'నూరీ' సినిమాకథ వినిపించాడు.

"మరి మన ప్రేమ కూడా అలాగే దుఃఖాంతం అయితే!" కళ్ళు తుడుచుకుంటూ గద్గద కంఠంతో ప్రశ్నించింది పూనమ్.

"లేదు లేదు. అలా కావడానికి వీల్లేదు. నూరీలో విలన్ వల్లనే వారి ప్రేమ దుఃఖాంతం. అలాంటి విలన్ మన మధ్యకు వస్తే నరికి పోగులు పెడతాను.'' అతని మాటల్లో ఎంతో ఆత్మవిశ్వాసం వున్నది. పూనమ్ అల్లాఉద్దీన్ ముఖంలోకి ప్రశంసాపూర్వకంగా చూసింది. అచ్చం సినిమాలోని హీరోయిన్ హీరో కేసి చూసినట్టే.

* * *

బీహార్ రాష్ట్రంలోని బెగూ సరాయ్ అనే జిల్లాలో "మజేలా" అనే ఒక చిన్న గ్రామం వున్నది. మన హీరో హీరోయిన్ ఆ గ్రామంలోని వారే. పూనమ్ తండ్రి సురేష్‌సింగ్ రెడీమేడ్ బట్టల షాపు నడుపుతున్నాడు. ఆమె తల్లి అక్కడి మిడిల్‌స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నది. వారికి నలుగురు పిల్లలు, పూనమ్ అందరికంటే పెద్దది. ఇద్దరు ఆడపిల్లలూ, ఇద్దరు మగపిల్లలూ. పూనమ్ పదిహేను ఏళ్ళకే చక్కగా పెరిగింది. శరీరంలో యవ్వనం చోటు చేసుకున్నా ముఖంలో పసితనం తరిగిపోలేదు. ఆమెను చూసిన ప్రతివాళ్ళూ ఓక్షణమైనా సర్వం మరచి ఆమెనే చూస్తూ వుండిపోతారు.

ఆ గ్రామంలో పూనమ్‌కు చదువుకొనే అవకాశాలు లేవు. కారణం హైస్కూలు లేదు. తల్లిదండ్రులకు మాత్రం పూనమ్‌ను ప్రైవేటుగా మెట్రిక్‌కు కూర్చోబెట్టాలని వున్నది. ఆమె తల్లికి మెట్రిక్‌కు తయారు చేసేంత ఇంగ్లీషు జ్ఞానం లేదు. యోగ్యుడు ఎవడైనా దొరికితే పూనమ్‌కు ప్రైవేట్ పెట్టించాలని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు.

సురేష్‌సింగు రెడీమేడ్ దుస్తుల దుకాణం ఎదురుగానే మహమ్మద్ బట్టల దుకాణం వున్నది. ఎదురెదురు దుకాణాలు. ఆ చిన్న గ్రామంలో

వాళ్లిద్దరూ సన్నిహితంగా వుండేవారు. హిందువుల పండుగలకు మహమ్మద్, అతని కుటుంబం సురేష్ యింటికి వస్తే ముస్లిముల పండుగకు వీళ్ళు వాళ్ళ ఇంటికి వేళ్ళే వాళ్ళు. పిల్లలందరూ కలసి మెలసి ఆడుకుంటుండేవాళ్ళు.

మహమ్మద్‌కు నలుగురు కొడుకులు. మూడోవాడు అల్లాఉద్దీన్. పెద్దవాళ్ళిద్దరూ చదువుకొని వేరు వేరు ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తున్నారు. అల్లాఉద్దీన్ ముజఫర్‌పూర్‌లో బి. యస్. సి. పరీక్ష వ్రాసి వచ్చాడు. తండ్రికి చేదోడుగా దుకాణంలో కూర్చునేవాడు. అల్లాఉద్దీన్ సురేశ్‌సింగును కాకా అని పిలిచేవాడు. అతనికి ఒక ఆలోచన వచ్చింది 'ఇంటి బిడ్డలాంటివాడు. పూనమ్‌కు అతనిచేత ప్రైవేట్ చెప్పిస్తే....'? అల్లాఉద్దీన్ వేంటనే సంతోషంగా అంగీకరించాడు.

సురేష్‌సింగ్ ఒకరోజు సాయంత్రం అల్లాఉద్దీన్‌ను వెంటబెట్టుకుని ఇంటికి తీసుకెళ్ళాడు. పూనమ్ తల్లి కూడా "చాలా కాలానికి చూశాను బాబు! ఎంత మారిపోయావు. ఏం చేద్దామనుకుంటున్నావు?" టిఫిన్ పెట్టి ఎదురుగా కూర్చుని ప్రశ్నల వర్షం కురిపించసాగింది.

"రిజల్ట్సు వచ్చాక టీచర్ ట్రైనింగ్ చెయ్యాలని వుంది" అన్నాడు

తన పిల్లల్ని పరిచయం చేసింది. పూనమ్‌ను చూశాడు. చూస్తూనే వుండిపోయాడు. పూనమ్ కనురెప్పలు కిందకు వాలిపోయాయి. వాకిలి పట్టుకుని నిల్చుంది.

"ఎందుకే అంత సిగ్గు! అల్లాఉద్దీన్ భయ్యా! ఎప్పుడూ నిన్ను ఉడికిస్తూ ఉండేవాడు" తల్లి నవ్వుతూ అన్నది.

"పూనమ్ ఎంత పెద్దదైంది కాకా!" ఆశ్చర్యంగా అన్నాడు.

పూనమ్ తండ్రి ఘొల్లున నవ్వాడు.

"నువ్వు పెద్దవాడివి కాలేదూ? పూనమ్ యింకా గౌను వేసుకుంటూ, పిలకజడల్తో పేలపిండి తింటూ కన్పిస్తుందనుకున్నావా?'' అన్నాడు సురేంద్రసింగ్.

అతని మాటలకు అందరూ నవ్వారు./

పూనమ్ కూడా నోటికి చెయ్యి అడ్డుపెట్టుకొని కిసుక్కుననవ్వింది.

అల్లాఉద్దీన్ లేవలేక లేచాడు. వెళ్తూ వెళ్తూ మరోసారి వెనక్కు చూశాడు. ఆ వయసు అలాంటిది.

రెండో రోజు నుంచి పూనమ్‌కు ట్యూషన్ చెప్పసాగాడు. పూనమ్‌తో పాటు ఆమె చిన్న తమ్ముడు పన్నాకు కూడా చదువు చెబుతున్నాడు.

అనతికాలంలోనే-కాదు-కొద్ది రోజుల్లోనే ఒకరిని ఒకరు ప్రేమిస్తున్నట్లు ఇద్దరూ భావించుకో సాగారు. కళ్ళతోనే ఎన్నో ఊసులు చెప్పుకొనేవారు.

అతను బి. యస్. సి. పాసయ్యాడు. టీచర్ ట్రయినింగుకు అప్లికేషన్ పెట్టడానికి పట్నం వెళ్ళాడు. అప్పుడే "నూరి" సినిమా చూశాడు. ఆ సినిమా చూసిన ఉద్వేగంలో సంకోచం వదిలేశాడు. ఆరోజు పన్నాకు జ్వరం రావడం వల్ల ట్యూషన్‌కు రాలేదు. ఆరోజు పాఠం ''నూరీ" సినిమా మీద జరిగింది. ప్రేమను గురించి, దాని పవిత్రతను గురించీ చెప్పాడు. పూనమ్ కళ్లు పెద్దవి చేసుకొని చుట్టూ ప్రపంచాన్ని మర్చిపోయి వినసాగింది.

* * *

ఆరునెలల కాలం గడిచింది. ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరగసాగింది. అల్లాఉద్దీన్‌కు ట్రైనింగ్ కాలేజీలో సీటు వచ్చింది. ఆరోజు అల్లాఉద్దీన్ ఉత్సాహంగా వున్నాడు. దిగులుగా కూడా వున్నాడు. సీటు వచ్చినందుకు సంతోషం, పూనమ్‌కు దూరం అవుతున్నందుకు దుఃఖం.... ఆ సంగతి విన్న పూనమ్ తన గదిలోకివెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చింది. తననుంచి అతి ప్రియమైన బంధం ఏదో విడిపోతున్నట్టు విలవిల లాడింది.

అల్లాఉద్దీన్ వెళ్ళిపోయాడు. నెలకు ఒకటి రెండుసార్లు వస్తూవే వున్నాడు. దిగులుగావున్న పూనమ్‌కు ధైర్యం చెబుతున్నాడు. వచ్చి నవ్వుడల్లా ''నూరీ'' సినిమా గురించి చెబుతూనే వుంటాడు.

ఒకరోజు ''నూరీ" అని పిలిచాడు.

''ఊఁ"

''నేను నువ్వు లేకుండా వుండలేక పోతున్నాను నూరీ!"

''నేను!'' వెల చూపులతో అన్నది.

'నాతో వచ్చెయ్!'

"అమ్మ బాబోయ్!''

"ప్రేమించే వాళ్ళు దేనికీ భయపడకూడదు తెలుసా!" బెదురు చూపులు చూసింది.

"నీకు నామీద ప్రేమ లేదు'' చిరాకు పడ్డాడు.

పూనమ్ కళ్లు చెమ్మగిల్లాయి.

డిసెంబరు 16, 1976న పూనమ్ ఇంటి నుంచి బయటికి వెళ్లింది. సహరస బస్ ఎక్కింది. బస్‌స్టాండ్‌కు వచ్చాడు. అల్లా ఉద్దీన్ పూనమ్‌ను తెలిసిన వాళ్లింటికి తీసుకెళ్లడం అపాయంతో కూడిన పని. ఆమె సెలహార్ కమీజ్‌లో వున్నది. భార్యభర్తలం అంటే ఎవరూ నమ్మలేకపోవచ్చును. వెంటనే రెండు చీరెలు, రెడీమేడ్ జాకెట్లు వగైరా కొని ఎంబసీ హొటల్‌కు తీసుకెళ్లాడు. భార్యభర్తలుగా రిజిస్టర్‌లో రాసి గది తీసుకున్నాడు. పూనమ్ దిగులుగా వుంది. అల్లాఉద్దీన్ ఉత్సాహంగా వున్నాడు.

''ఇది మన కలలు పండినరోజు నూరీ! నువ్వు దిగులుగా వుండ కూడదు! నవ్వుతూ కన్పించాలి.''

పూనమ్ దిగులుగా నవ్వింది. తను చేసిన పని మంచిది కాదని బస్‌లో కూర్చున్నప్పటి నుంచీ మనసులో ఎవరో చెబుతున్నట్లు అన్పించ సాగింది.

ఇక్కడ-అంటే-మజేలా గ్రామంలో పూనమ్ కన్పించక ఇంటి వాళ్ళు గాభరా పడ్డారు. వయసు వచ్చిన ఆడపిల్ల యింట్లో కన్పించడం లేదు. చిన్నవూరు....ఆవార్త పిడకలగూటి పొగలా ఊరంతా వ్యాపిం చింది. నాలుగురోజులు ఏం చెయ్యాలో తోచలేదు. ఒక్కసారిగా భార్యా భర్తలకు అల్లాఉద్దీన్ గుర్తొచ్చాడు. పన్నాకూడా వాళ్లిద్దరూ ఏమేమో మాట్లాడుకునే వాళ్లని, పాఠాలు చెప్పేవాడు కాదనీ చెప్పాడు.

సురేష్‌సింగ్ తన సోదరుడు కుముద్‌సింగునూ, పన్నానూ సహ రసకు పంపించాడు. తెలిసిన వాళ్ళందర్నీ వాకబుచేశారు. చివరకు అల్లావుద్దీన్ ఒక అమ్మాయితో ఎంబసీ హొటల్లో వున్నాడని తెలిసింది. వెంటనే ఇద్దరూ హొటల్‌కు వెళ్ళారు. హొటల్ మేనేజర్ ద్వారా

గది నెంబరు తెలుసుకున్నారు. వాళ్ళు గదిలోకి వెళ్ళేసరికి పూనమ్ ఒక్కర్తే ఆలోచిస్తూ పడుకుని కన్పించింది. తన బాబాయినీ, తమ్ముణ్ణి ఎదురుగా చూసి బావురుమని ఏడ్చింది. కానివాళ్ళతో వెళ్ళడానికి ఇష్టపడలేదు.

"ఏం చేద్దాం అనుకుంటున్నావ్?"

"ఇద్దరం రిజిష్టర్ పెళ్లి చేసుకుంటాం!''

"నువ్వు ఇంకా చిన్నపిల్లవు. ఈ పెళ్ళి పెద్దవాళ్ల ఇష్టం లేకుండా జరగదు. పోలీసు రిపోర్టు ఇస్తే మైనర్ పిల్లను తీసుకు వచ్చినందుకు అల్లావుద్దీన్‌ను జైల్లో పెడ్తారు. మన కుటుంబ పరువు బజారు ఎక్కుతుంది. జీవిత మంతా నవ్వు తల వంచుకునే బ్రతకాల్సి వుంటుంది. పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు. బయలుదేరు" పూనమ్ బాబాయి మందలించాడు.

పూనమ్ మారు మాట్లాడకుండా వాళ్ల బాబాయితో బయలుదేరింది. అతనే హెూటల్ బిల్లు చెల్లించాడు. పూనమ్‌ను తీసుకొని దూరపు బంధువైన రామచంద్రసింగు ఇంటికి వచ్చాడు. అల్లావుద్దీన్‌కు కూడా వాళ్లు బాగా తెలుసు. వాళ్ల యింటికి వస్తూ పోతూ వుండేవాడు. "ఈ పిల్ల ఎవరు?" పూనమ్‌ను చూసి రామచంద్ర అడిగాడు.

"మా అన్నయ్య కూతురు.'' కుముద్ సింగ్ సమాధానం ఇచ్చాడు. రామచంద్రసింగు భార్య గాయత్రిని పిల్చి వాళ్లను పరిచయం చేశాడు. అందరూ భోజనాలకు కూర్చున్నారు. "పూనమ్‌ను సాయంత్రం వరకూ ఇక్కడే వుంచండి. రాత్రి బస్‌కు వెళ్లిపోతాం" అని చెప్పి కుముద్ బయటికి వెళ్లిపోయాడు. రామచంద్ర తన దుకాణానికి వెళ్ళాడు.

కాలేజి నుంచి హెూటల్‌కు వచ్చిన అల్లావుద్దీన్‌కు మేనేజర్, "పూనమ్‌ను ఒక చిన్న పిల్లవాడూ, ఒక పెద్దాయన వచ్చి తీసుకెళ్ళారు"

అని చెప్పాడు. అల్లావుద్దీన్ చాలా ఆవేశపడ్డాడు. అక్కడ్నుంచి బయలు దేరాడు. రామచంద్రసింగు ఇంటికి వచ్చాడు. గాయత్రీదేవి ఇంట్లో కూర్చుని పక్కింటి డాక్టరుగారి భార్యతో కబుర్లు చెబుతున్నది. దూరంగా వన్నా, పూనమ్ కుర్చీలలో కూర్చుని వున్నారు.

''రావయ్యా! ఈమధ్య కన్పించడంలేదేం!'' గాయత్రి ఆప్యా యంగా అల్లావుద్దీన్‌ను ఆహ్వానించింది. ''తీరికలేదు'' అన్నాడు పూనమ్ వైపు చూస్తూ. పూనమ్ అతన్నిచూసి చూడనట్టే కూర్చుంది.

అల్లావుద్దీన్ రెండు నిముషాలు ముళ్ళు మీద కూర్చున్నట్టు కూర్చున్నాడు. లేచి నిలబడ్డాడు.

''అదేమిటి! అప్పుడే వెళ్తున్నావ్. చాయ్‌తాగిపో!'' అన్నది గాయత్రీదేవి.

"ఇప్పుడే వస్తాను'' అంటూ చరచర వెళ్ళిపోయాడు బయటికి. అర్ధగంట తర్వాత తిరిగి వచ్చాడు. కళ్లు ఎర్రగా వున్నాయి. గదిలోకి వచ్చాడు. ఆ ఆడవాళ్ళిద్దరూ మాటల్లో మునిగిపోయి వున్నారు. పూనమ్ కూడా వాళ్ల పక్కనే కూర్చుని వున్నది. లోపలకు వస్తూనే బొడ్లోనుంచి తళతళ మెరిసే కత్తి తీశాడు. గాయత్రీదేవి మీదకు వస్తున్నట్టు నటిం చాడు. ఆడవాళ్ళిద్దరూ బయటికి పారిపోయారు. అతనికి కావల్సింది అదే!

పూనమ్ ఒక మూలగా వణుకుతూ నిల్చుండిపోయింది. తలుపులు వేసి లోపల నుంచి గడియ పెట్టాడు. గాయత్రీదేవి పెడుతున్న కేకలకు ఇరుగు పొరుగువాళ్ళు చేరారు. తలుపులు బాదసాగారు. తలుపులు తెరుచుకోలేదు. పూనమ్ గావుకేక పెట్టింది. అతి ప్రయత్నం మీద తలుపులు బద్దలు కొట్టారు.

ఎదురుగా పూనమ్ రక్తపు మడుగులో నిర్జీవంగా పడి వున్నది. అల్లావుద్దీన్ పీక కొద్దిగా తెగింది. రక్తం కారుతుంది. తన్నుకుంటు న్నాడు. వెంటనే అతన్ని కొందరు ఆసుపత్రికి చేర్పించారు. పోలీసు వచ్చాడు. పోస్టుమార్టం చేశారు.

పూనమ్ మెడభాగం చాలా లోతుగా తెగిందనీ, ఎవరికివారు కోసుకున్నప్పుడు అంతలోతుగా కోసుకోవడం అసంభవం అనీ డాక్టర్ సర్టిఫై చేశాడు కోర్టులో పన్నా సాక్ష్యం చెప్పాడు.

వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ అంతా చెప్పాడు పన్నా-

"నువ్వు ఇక్కడి కెందుకొచ్చావ్?'' అల్లావుద్దీన్

''ఏం చెయ్యను? బాబాయి లాక్కొచ్చాడు. ఇలా రావడం తప్పని నాక్కూడా అనిపిస్తూనే వున్నది'' పూనమ్ సమాధానం.

''అయితే ఈ చాకు తీసుకుని నీ గొంతు కోసుకో!"

"నావల్ల కాదు. నువ్వే కొయ్.

భయంతో వణికిపోతూ వరండాలో నిల్చున్న పన్నాకు అంత వరకూ వినిపించింది. ఆ తర్వాత పూనమ్ గావుకేక వినిపించింది. అదే విషయం పోలీసులకు చెప్పాడు.

* * *

పూనమ్ శవాన్ని బంధువులకు అప్పగించారు.

అల్లావుద్దీన్ ఆసుపత్రిలో క్రమంగా కోలుకున్నాడు.

''ఇద్దరం చచ్చిపోవాలనుకున్నాం. ఆమె తన గొంతు కోసు కుంది. నేనూ ఆ కత్తితో కోసుకున్నాను. కొద్దిగా తెగగానే కత్తి దూరంగా

పారేశాను. గట్టిగా కోసుకోలేక పోయాను'' అని అల్లావుద్దీన్ చెప్పాడు.

కాని పోలీసులు అతని మాటల్ని నమ్మలేదు.

సహారసా పోలీస్ ఈ కేసును భారతీయ న్యాయశాస్త్రం ప్రకారం రూలు 302/309 క్రింద నమోదు చేశారు.

19-12-1978వ తేదీన కేసు నమోదు అయింది. ఇంకా కోర్టులో ఈ కేసు నడుస్తూనే వున్నది. అపరిపక్వ మనస్కులకు సంబంధించిన ప్రేమకథకు పరిణామం అది. ఇకముందు ఏం జరుగుతుందో వేచిచూద్దాం.

అల్లావుద్దీన్ మాత్రం తను హత్యచేసినట్టు అంగీకరించడంలేదు అతని డయిరీ నిండా 'నూరీ! నూరీ! అని రాసి వుండటం మరొక ప్రత్యేకత. "నేనూ, నూరీ చచ్చిపోవాలనుకున్నాం. నూరీ సాహసించింది. అంత సాహసం నేను చెయ్యలేక పోయాన"ని కన్నీళ్ళతో చెబుతాడు.

అతనికి జామీన్ కూడా యివ్వలేదు. కన్నీళ్ళతో ''నూరీ'' పేరే కలవరిస్తూ జైల్లో వున్నాడు.